# దుప్పటి



ఆలూరి రామకృష్ణ

మడతపెట్టిన దుప్పటి అంచుల్ని చేత్తో నిమురుతూ నిలబడిపోయేడు వెంకటరత్నం.

వెనుక బీరువాలో, ముందు టేబిల్ మీద రంగురంగుల దుప్పట్లున్నాయి. అప్పుడే కస్టమర్స్‌కి దుప్పట్లు చూపించి మడతబెట్టాడు బీరువాలో సర్దటానికి. రకరకాల దుప్పట్లు చూస్తుంటే వెంకటరత్నం మనస్సు చెదిరిపోయి పాత జ్ఞాపకాల దుప్పట్లో దూరిపోయింది.

పదేళ్ళు వుంటాయి తనకి అప్పుడు.

ఎముకలు కొరికే చలిరోజుల్లో వొకే దుప్పటిని అడ్డంగా కప్పుకుని తనూ, తమ్ముడు, అమ్మ, అమ్మమ్మ వొకరికొకరు కరుచుకుపోయి పడుకునేవాళ్ళం. తమ్ముడికి తప్పితే అందరికీ దుప్పటి మోకాళ్ళవరకే వచ్చేది. వొకరాత్రయ్యేసరికి చివర పడుకున్నవాళ్ళ వొంటిమీద దుప్పటి వుండేది కాదు. చలికి గిజగిజలాడేవాళ్ళం.

ఏ అర్ధరాత్రో తాగొచ్చి యింటికి చేరుకొనేవాడు నాన్న. నాన్న కేకలకి మెలకువ వచ్చేది తనకి.

చీకట్లో ఎవరు ఎక్కడున్నారో తెలియక తమ్ముడి కాలో, తన కాలో తొక్కుకుంటూ వెళ్ళి అమ్మమ్మ తొడల మీద చేతులేసేవాడు నాన్న.

"నీ పెళ్ళాం అ చివరుంది రా! ఛీ.... ఛీ.... అటు చావు!"— అమ్మమ్మ చీదరించుకునేది. తడుముకుంటూ అమ్మ దగ్గర చేరేవాడు.

"అన్నం తిందువుగాని లే!"— అమ్మని లేవనిచ్చేవాడు కాదు. కొన్ని క్షణాలు నాన్న బూతుమాటలు, అమ్మ తిట్లూ విన్పించేయి....

బాగా తాగొచ్చినప్పుడు దుప్పటి లాగేసుకుని, తానొక్కడే కప్పుకునేవాడు. అమ్మని కొట్టేటప్పుడు, దుప్పటి లాక్కున్నప్పుడు 'నాన్నని పెద్దయ్యాక చావగొట్టాలి' అనుకునేవాడిని.

....చిన్నప్పుడు కప్పుకోటానికి గుడ్డ పీలిక కూడ లేకుండా చలికి వొణికేవాళ్ళని చూసినప్పుడల్లా దిగులేసేది. పెద్దయ్యాక యింట్లో అందరికీ తలొక దుప్పటి కొనాలనుకునేవాడు....

కనీసం దుప్పటి కొనగలే స్థితిలో వున్నాడు తను.

కానీ తనవాళ్ళెవరూ మిగలలేదు.

....అమ్మమ్మ చనిపోయినప్పుడు దహనానికి పేటలోవాళ్ళు చందాలేసుకుని యిచ్చిన రెండొందలు తన కివ్వలేదని అమ్మని చావబాదేడు నాన్న. దెబ్బలకు తట్టుకోలేక తమ్ముడిని తీసుకుని ఎటో వెళ్ళిపోయింది అమ్మ. తనప్పుడు యింట్లో లేడు. వున్నట్లయితే అమ్మవెంట వెళ్లి వుండేవాడు.

నాన్న కూడ మిగల్లేదు తనకి. తొక్కుతున్న రిక్షా లారీకి గుద్దుకోవడంతో నాన్న చనిపోయేడు.

లారీ వోనరు తనను తీసుకెళ్ళి పదో తరగతివరకు చదువు చెప్పించి, తన బట్టలకొట్లోనే గుమాస్తాగా వుంచేడు....

"ఏమిటి? ఆలోచనలో పడ్డారు. దుప్పట్ల సెక్షన్‌లోకి ఎప్పుడొచ్చినా మీరు ఈ లోకంలో వుండరు"— వెంకటరత్నాన్ని పలుకరించింది నిర్మల, అతని ముందున్న దుప్పట్లు తీసి బీరువాలో సర్దుతూ.

"శారీస్ సేల్స్ ఎలా వున్నాయి?"— పెదాలపైన చిరునవ్వు పులుముకుంటూ అడిగేడు.

"మీరు భలేవారు.... మనస్సులో మాట చెప్పరుగా! మాట మార్చేస్తారు"— అంది నిర్మల నవ్వుతూ.

"ఈ రోజు ఆత్మీయుల కెవరికన్నా మనస్సులోని మాట చెప్పాలనుకుంటున్నాను."

"ఆత్మీయులు ఎంతమంది వున్నారేమిటి మీకు!"

ఎవరో కస్టమర్ రావడంతో శారీస్ సెక్షన్‌వైపు వెళ్లిందామె.

"నాకో దుప్పటి కావాలి సార్! జీతంలో మినహాయించుకోండి"— దుకాణం మూసే సమయంలో ప్రొప్రైటర్‌ని అడిగేడు వెంకటరత్నం.

"నీ కేమన్నా పిచ్చా! చాదస్తమా! ప్రతినెలా దుప్పటి కొంటుంటావ్. దానం చేస్తున్నావా ఏమిటి? ఎంతమందికని చేస్తావయ్యా? కప్పుకోడానికి దుప్పటి లేనోళ్ళు కొన్ని కోట్లమంది వున్నారీ దేశంలో! నాలుగు డబ్బులు వెనకేసుకోవయ్యా? రేపు పెళ్లయితే అన్నీ ఖర్చులే!" —అన్నాడు ప్రొప్రైటర్.

దుప్పటి పాక్ చేసుకుని చేతి సంచిలో వేసుకున్నాడు వెంకటరత్నం. షట్టర్స్ వేసి, తాళాలు లాగిచూసి తాళం చేతులు ప్రొప్రైటర్‌చేతి కిచ్చాడు.

"నే నలా అన్నానని ఏమనుకోకయ్యా! నీ కాళ్లమీద నిన్ను నిలబెట్టాలనేదే నా తాపత్రయం.... మరో సంగతి! ఆ పిల్లని పెళ్ళిచేసుకోగూడదూ! పైగా నువ్వంటే యిష్టపడుతున్నట్లుంది."

తెల్లబోయి ప్రొప్రైటర్‌వైపు చూసేడు వెంకటరత్నం.

"అదేనయ్యా! నిర్మల గూర్చి నే మాట్లాడుతుంటా! వాళ్ళు వొకప్పుడు బాగా బతికినవాళ్ళే! ఇప్పుడు బాగా చితికి పోయారనుకో! కలో, గంజో తాగుతూ గుట్టుగా బ్రతికే మనుష్యులు.... ఆ అమ్మాయి నీకు సరైన జోడు"— అనేసి స్కూటర్ మీద వెళ్ళిపోయేడు ప్రొప్రైటర్.

వెంకటరత్నానికి ఆశ్చర్యమేసింది.

నిర్మల, తనూ సన్నిహితంగా వున్నట్లు ఎలా పసిగట్టాడీయన? లోతైన మనిషి.... తన క్షేమాన్ని కోరే వ్యక్తి. అన్నీ ఆలోచిస్తాడు. తండ్రి లారీక్రింద పడి చనిపోయిన దగ్గర్నుండి ఆయన కనుసన్నలలోనే పెరిగేడు తను.... ఆయన చెప్పాడని కాదుగాని, తనకీ నిర్మలంటే అభిమానం. .... ఆమెనే పెళ్ళిచేసుకోవాలనుకుంటు న్నాడు....

ఆమెతో పరిచయమైన మొదటిరోజే తన గుండెల్లో ఆమె రూపం చోటు చేసుకుంది.

ఆ రోజు—

కస్టమర్‌కి దుప్పటి మడత పూర్తిగా విప్పి డిజైన్స్ చూపిస్తున్నాడు తను. నిర్మల వొచ్చి తన పక్కన నిలబడటం గమనించలేదు.

మళ్ళీ మడత పెట్టడానికి దుప్పటి బల్లమీద పడెయ్యగానే పెళ్ళికూతురిలా సిగ్గుపడుతూ తలొంచుకుని వున్న నిర్మల కన్పించింది.

పెళ్ళిసమయంలో దుప్పటి తొలి గించగానే పెళ్ళికూతురువైపు ఆతృతగా చూసే పెళ్ళికొడుకులా చూసేడు తను.

వధూవరుల మధ్య కొన్ని క్షణాలు దుప్పటి అడ్డుంచటం తన కెంతో యిష్ట మైన దృశ్యం పెళ్ళిళ్ళలో.

వధువుని చూడాలనే వరుని తపన....

ఎన్నో సంవత్సరాల విడదీయలేని బంధానికి ప్రత్యక్షసాక్షిగా వధూవరుల మధ్య నిలిచే దుప్పటి....

దుప్పటికి అవతలవైపు తన జీవి తాన్ని పంచుకోబోతున్న వరుని రూపాన్ని కళ్ళల్లో నింపుకోవాలనే వధువు తపన....

దుప్పటి తియ్యగానే కళ్ళు, కళ్ళూ కలుసుకునే మనోహరమైన దృశ్యం....

బిడియపడుతూ తనవైపు చూసి, తన చూపులకు తట్టుకోలేక తల వొంచు కుంది నిర్మల.

"మీ రిటు లోపలికి రాకూడదు. బల్లకి అవతల నిలబడితే మీకేం కావా లన్నా చూపిస్తాను."— ఆమె కస్టమర్ అనుకుని అనేసేడు తను.

ఆమె నవ్వి వూరుకుంది. విచ్చు కున్న ముద్దబంతి పువ్వులా కన్పిం చిందామె.

ప్రొప్రైటర్ వొచ్చి నిర్మలని తనకి పరిచయం చేసి వ్యాపార మెళకువలు నేర్పమన్నాడు.

తన చీకటి జీవితంలోకి వెన్నెల కిరణంలా ప్రవేశించిందామె.

ఆమె గుండెల్లో తనకి చోటున్న దనటానికి వో చిన్న సంఘటన చాలు—

కస్టమర్స్ ఎవ్వరూ రాలేదా రోజు—

ఏమీ తోచక తెల్లకాగితం తీసుకుని పెన్నుతో బొమ్మలు గీయటం మెదలు పెట్టాడు తను.

ఏటిగట్టున చెట్లు—

ఏటిలో నావ—

దూరంగా కొండలు.... కొండలవెనుక అస్తమిస్తున్న సూర్యుడు.... ఆకాశంలో ఎగురుతున్న పక్షులు.... గాలికి ఏటి గట్టున వూగుతున్న చెట్లు....

తిరుగుముఖం పట్టిన పశువులు.... పిల్లనగ్రోవి వాయిస్తూ వాటి వెనుక పశువులకాపరి....

పక్కనే నిలబడి తదేకంగా ఆ చిత్రంవైపు చూస్తున్నది నిర్మల.

పెన్ను కాప్ జారి బల్లకింద పడింది.

వెతకడానికి తామిద్దరూ వొకేసారి కిందకు వంగారు. ఆమె చెంప తన చెంపకు మెత్తగా తగిలింది.

ఆమె తల్లోని సన్నజాజి పరిమళాలు తనని చుట్టేసేయి.

"క్షమించండి!" అన్నాడు మెల్లగా బల్లకింద చెయ్యిపెట్టి క్యాప్‌కోసం వెతుకుతూ. తను వారిస్తున్నా వినకుండా ఆమెకూడా క్యాప్‌కోసం వెతకసాగింది.

ఆ వెతకడంలో ఇద్దరి చేతులు కలిసేయి.

పెన్నుకాప్ ఆమెకే దొరికింది.




"ఈ పెన్ను నా కిచ్చెయ్యండి!"— తన మాటకోసం ఎదురుచూడకుండా పెన్ను, గీసిన చిత్రాన్ని చొరవగా తన

బ్యాగ్‌లో పెట్టుకుంది.

"తీపి అనుభవాలకు గుర్తుగా వుంచుకుంటాను"— అందామె.

ఆమె పరిచయం, ప్రేమగా మార్చిన సంఘటనలన్నీ గుర్తుకొచ్చాయి వెంకటరత్నానికి.

"ఏం బాబూ! తాళా లేశారుగా.... ఇక్కడే నిలబడిపోయారే?" —రోజూ దుకాణంముందు అరుగుపై పడుకునే తాత వెంకటరత్నాన్ని పలుకరించేడు.

రోజూ దుకాణం మూసే సమయానికల్లా అక్కడే తారసలాడ్లాడుతూ వుంటాడు తాత. దుకాణం ముందు రాతి అరుగు తాత సొంతం. రాత్రిళ్ళు అక్కడికి ఎవ్వరినీ రానివ్వడు. ఎప్పుడన్నా బీడీలకు కక్కుర్తిపడి ఆ చోటు మరో బిచ్చగాడికో, దారిన పోయే దానయ్యకో ధారాదత్తం చేసి అక్కడే వో మూల కూర్చుని కునికిపాట్లు పడతాడు.

భుజంమీదవున్న పాతగుడ్డ పడుకునే చోట పరుచుకుని నడుంవాల్చాడు తాత.

చలిలో ఎలా పడుకుంటాడో?

ఇంత చలిలో బయట పడుకోవడం కంటే ఏ తప్పో చేసి గాలి, వెలుతురు రాని జైలుగదుల్లో పడుకోవడం మేలే నేమో!

మళ్ళీ లేచి కూర్చున్నాడు తాత ఏదో గుర్తుకు వచ్చి.

"బాబయ్యా! వో పాతదుప్పటి వుంటే ఈ ముసలోడి మొహాన పడెయ్యండి! మీకు పుణ్యం వుంటుంది బాబూ! చలికి ఆగలేకపోతున్నా?"

చేతిలో వున్న కొత్త దుప్పటి యిచ్చెయ్యాలని ఉద్రేకపడ్డాడు వెంకటరత్నం వో క్షణం. పాత సంఘటనొకటి మెదడు పొరల్లో మెదలడంతో ఆ ప్రయత్నం విరమించుకున్నాడు.

బట్టల దుకాణంలో గుమాస్తాగా కుదిరిన మొదట్లో, జీతం రాగానే దుప్పటి కొని ఆ ముసలాడికే యిచ్చేడు. మరుసటి రోజు పెద్ద గొడవైంది. కొట్లో దుప్పటి కాజేసేదేమోనని బీట్ కానిస్టేబుల్‌కి అనుమాన మొచ్చింది. ఆ దుప్పటి లాక్కొని ముసలాడ్ని జైల్లో తోసేడు.

ఆ విషయం తెలిసి పోలీస్‌స్టేషన్ వెళ్ళి దుప్పటి తానే యిచ్చేనని చెప్పి ముసలాడిని విడిపించేడు. ముసలాడు జైల్లోనుంచి బయటపడ్డాడే గాని, దుప్పటి మాత్రం వాడికి దక్కనివ్వలేదు కానిస్టేబుల్.

తాత మాటలు విన్పించుకోనట్లు నటిస్తూ అక్కడనుంచి కదిలేడు వెంకటరత్నం.

బస్‌స్టాప్ దగ్గర నిర్మల కన్పించింది.

"మీ బస్సు యింకా రానట్లుందే?"

"వచ్చే సూచనలేవీ కన్పించడం లేదండీ! రిక్షా ఎక్కి వెళ్దామనుకుంటున్నాను."

"తోడు రమ్మంటారా?"

"...............”

రిక్షా పిలిచేడతను.

ఆమె పక్కనే కూర్చున్నాడు.

తనకు ఆమెభుజం తగులుతూ వుంటే అనిర్వచనీయమైన అనుభూతి పొందాడు అతను.

మెల్లగా ఆమె చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు.

"మీ నాన్నతో రేపు మాట్లాడాలి!"

"ఏ విషయం గూర్చి?"— అని చప్పు ప్రశ్నలు వేసే స్థితిలో ఆమె లేదు. ఆమెకు తెలుసు అతను ఏంమాట్లాడతాడో.

ఇంటిదగ్గర నిర్మలను వొదిలేసి, తన రూముకు చేరుకున్నాడు వెంకటరత్నం!

* * *

ఉదయమే వొండుకున్న అన్నం తిని, చాప పరుచుకుని పడుకున్నాడు వెంకటరత్నం.

నిద్రపట్టక అటూ, ఇటూ దొర్లేడు.

కొత్తదుప్పటి గుచ్చుకుంటున్నట్లని పించింది.

చిన్నప్పటి రోజులు గుర్తుకొచ్చేయి ..

చిన్న పూరిపాక....

చాలీచాలని దుప్పటి....

దుప్పటి లాక్కొనే తండ్రి....

చలికి ఆగలేక తనను కరుచుకుపోయి పడుకునే తమ్ముడు....

ఇప్పు డెక్కడవున్నారో అమ్మ, తమ్ముడు? ఎన్ని యిబ్బందులు పడు తున్నారో?....

....చలి.... చలి....

ఆ ముసలాడు చలిలో ఎలా పడు కుంటున్నాడో?

తాతకు ఈ దుప్పటి యిచ్చివేస్తే!

....తన పేరు చెప్పుకుని హాయిగా, వెచ్చగా దుప్పటికప్పుకుని పడుకుంటాడు. తను మరో దుప్పటి కొనుక్కుంటే సరి....

ఇప్పుడు వెళ్ళి నిద్రపోతున్న తాత మీద దుప్పటి కప్పివస్తే! ఉదయం లేచి కొత్తదుప్పటి చూసుకుని ఆశ్చర్య పోతాడేమో!

....దుకాణం కూడ పెద్దగా దూరం లేదు....

లేచి దుప్పటి మడత పెట్టాడు.

* * *

ఉదయం దుకాణం తెరవడానికి వెళ్ళగానే—

దుకాణంముందు జనం—

ఆశ్చర్యపడుతూ వాళ్ళను తోసుకుని అరుగు దగ్గర కెళ్ళాడు.

శాశ్వతంగా నిద్రపోతున్న తాత—

తలమీద పెద్ద గాయం—

"ముసలొగ్గును చంపాల్సిన అవసరం ఏ గాడిదకొడుక్కి వొచ్చిందో! చివరికి బిచ్చగాళ్ళనుకూడ చంపేస్తున్నారు."

చుట్టూ మూగిన జనం మాటలు వెంకటరత్నానికి విన్పించడంలేదు.

అతని కళ్ళు కొత్త దుప్పటికోసం చుట్టూ చూసేయి. ఎక్కడా కన్పించలేదు.

———